


# బొమ్మ

కె.బి. కృష్ణ

విక్రమరావు ఆరడుగుల ఎత్తు ఉంటాడు. ఎత్తుకు తగ్గ లావు. గళ్ల చొక్కా, లేదా బొమ్మల బనీను. జీన్స్ పాంటు. ఎప్పుడూ చేతిలో సిగరెట్, నోట్లో ఉగ్రతాంబూలం. ఎప్పుడు ముఖంనిండా చిరునవ్వు. ఒక చెయ్యి మీసాలమీద, మరో చెయ్యి నడుంమీద. చూడటానికి మగాళ్లకు 'ఇదే పర్సనాలిటీరా బాబూ!' అని అసూయపడేట్లుగానూ, ఆడాళ్లకయితే, "అబ్బ! ఏం మగాడే! ఒక్కసారి వాడి చేతిలో పడితే ఒళ్ల నొప్పులు తగ్గిపోతాయి!" అని బ్రహ్మానందపడిపోతారు.

అలాంటి విక్రమ్ అనబడే విక్రమరావు వయసు ముప్పై దాటుతున్నా పెళ్లిమాత్రం చేసుకోలేదు. ఎందుకంటే చేతిలో సిగరెట్ ఎప్పుడూ ఉండగా, ఎప్పుడైనా మూడీగా ఉన్నప్పుడు మద్యనిషేధం ప్రభుత్వం పకడ్బందీగా అమలు జరుపుతుంటే, అప్పుడప్పుడూ రెండు పెగ్గులు లాగించేస్తాడు. ఆ తరువాత మూడో ఐటమ్‌లోకి వెళ్తాడు.

పెళ్లి చేసుకోమంటే, ఎప్పుడూ 'బార్బరస్', ఎప్పుడూ ఒకే స్త్రీ! కొత్తలో ఆనందంగా ఉన్నా, పోను పోనూ సమస్యల వలయంలో చిక్కుకునే తన సాటి స్నేహితులను చూసి, వారి అనుభవాలను విని పెళ్లి చేసుకోలేదు విక్రమ్.

వాత్సాయన కామసూత్రాలు చదివి, పద్మిని, శంఖిణి, చిత్తిణి తదితరజాతి స్త్రీలు ఎలా ఉంటారు? వారి గుణగణాలు, వారి అవయవ సంపద, వారితో అనుభవం ... ఇవన్నీ విక్రమ్‌కు దినచర్య.

నాలుగడుగుల మూడంగుళాల స్త్రీల నుండి ఆరడుగుల స్త్రీల వరకూ సన్నటి షలాకులాంటి స్త్రీల నుండి, లావుపాటి స్త్రీల వరకూ విక్రమ్ అనుభవించేశాడు. అయితే, ఒక చిక్కొచ్చిపడేది. అప్పుడప్పుడూ తన తల్లి,

"అబ్బాయ్! పెద్దాడివైపోతున్నావ్. ఇంకొన్నాళ్లు పోతే తెల్ల వెంట్రుకలు వచ్చేస్తాయి. పెద్దాడివైపోయా వనుకుంటారు. నువ్వు పెద్దాడివైపోతే పెళ్లి కాదురా! కోడల్ని తీసుకురారా బాబూ! తిరిగిన తిరుగుళ్లు చాలు, ఇంటిపట్టున స్త్రీ ఉంటే నువ్వు ఎప్పుడు వచ్చినా నీకు సేవలు చేస్తుంది. నేను మాత్రం ఎన్నాళ్లు ఉంటాను?" అంటూ ఉంటుంది.

"దానికి పెళ్లి ఎందుకే, కొంత డబ్బు పడేస్తే పనమ్మాయి వస్తుంది కదా!" అని తేలిగ్గా మాట్లాడేవాడు విక్రమ్.

"ఏమిటో, నీ బుర్ర దేముడు ఎప్పుడు మారుస్తాడో! నేను బతికుండగా నువ్వు మనసు మార్చుకుని పెళ్లి చేసుకుంటే నీ పిల్లల్ని ఎత్తుకోవాలని ఉందిరా!" అనేది.

"అలాగా! అయితే ఊర అనాథాశ్రమానికి వెళ్లి పసిపాపని తీసుకువస్తాను. అది నాకు పుట్టిందనుకుని, దానితో ఆడుకో! మనకు పుణ్యం, పురుషార్థం గిట్టుబాటు అవుతాయి!" అనేవాడు.

ఇదీ విక్రమరావు మనసు.

విక్రమరావు శ్రీకాకుళంలో మొదలుపెట్టి, కాకినాడ, పెద్దాపురం, రాజమండ్రి, బెజవాడ, చిలకలూరిపేట, తెనాలి, తెలంగాణా ప్రాంతం, రాయలసీమ మొత్తం స్త్రీలను సర్వే చేసి ముత్యాల ముగ్గులు పెట్టాడు. అయితే, వాళ్లలో ఎవరూ విక్రమ్‌ని శాశ్వతంగా తనవాడిని చేసుకోలేకపోయారు. కనీసం టెంపరరీగానైనా సెటప్ చేయలేకపోయారు.

అయితే ఒక్కసారి ... కాకినాడలో ఒకరోజు సాయంత్రం ... మసీదు సెంటర్ కృష్ణ కిళ్లీ కొట్టు దగ్గర రోజులాగే ఉగ్రతాంబూలం వేసుకుని, సిగరెట్ కాలుస్తుంటే తనముందు ఒక రిక్షా ఆగి ఉంది.

అందులోనుండి ఒక మెరుపు మెరిసింది. ఆమె రిక్షా దిగింది. సుమారు ఆరడుగులు ఉంటుందేమో ..., మెరుపుతీగెలా ఉంది. పాన్ షాపు దగ్గర జనం తమ ఉనికి మరిచిపోయారు. ఆమె సౌందర్యం అటువంటిది! ఆమె వయ్యారాలలో శ్రీదేవిని మరపించింది. ఒంపుసొంపులలో రంభని మట్టికరిపించింది. నడకలో జయప్రదని తలదన్నింది.

పాన్‌షాపుకి వెళ్లి "మిఠాయి కిళ్లీ!" అనగానే, మిఠాయి కిళ్లీలు రెడీగా ఉంటాయి కాబట్టి, వెంటనే ఇచ్చేశాడు.

తటిల్లతలా మెరిసి రిక్షాలో వెళ్లిపోయిన ఆమెతోపాటు పాన్‌షాపు దగ్గర ఉన్నవాళ్ల మనసులు కూడా వెళ్లిపోయాయి.

వెధవ, మిఠాయి కిళ్లీలు కట్టి ఉంచడం ఎందుకు? కాస్సేపు ఆమెను నుంచోబెట్టి కిళ్లీ కట్టి ఉంటే, ఆమెను ఆ కాసేపు చూసేవాళ్లం కదా! అని అక్కడ ఉన్న జనం అనుకుని, అదే సంగతి పాన్‌షాప్ కృష్ణకు చెప్పారు కూడా సిగ్గువిడిచి.

విక్రమ్ మనసు రిక్షా ఎక్కి ఎప్పుడో వెళ్లిపోయింది.

మర్నాడు విక్రమ్ రిక్షావాడిని పట్టుకుని ఆమె అడ్రస్ తెలుసుకున్నాడు.

"హలో!" తలుపుకు అడ్డంగా ఆమె.

చిరుకోపంతో అతన్ని చూస్తూ. "ఎవరు కావాలి!" ఇంకా దారికి అడ్డంగానే ఉందామె.

అతను నవ్వుతూ, "దారికి అడ్డం తొలిగితే లోపలకు వచ్చి వివరాలు చెప్తాను!" అసంకల్పిత ప్రతీకార చర్యలాగా ఆమె వెనుతిరిగింది.

వెళ్తున్న ఆమె చెవిలో "మీరే కావాలి!" అన్నాడు విక్రమ్.

"ఖరీదైన వస్తువులు కోరుకోకూడదు" అంది కవ్వింపు జోడించి నవ్వుతూ.

"ఈ విక్రమ్ ఎంత ఖరీదైన సరుకునైనా సరే, అత్యంత వెలతోనైనా సరే కొనేస్తాడు. ఎంతేమిటి?"

"సరసులే!" అందామె నవ్వుల అస్త్రాలు వదులుతూ. ఆ అస్త్రాలు విక్రమ్ గుండెల్లోకి దూసుకుపోయాయి.

"ఈ ఊరు ఎప్పుడు వచ్చారు శ్రీదేవిగారూ!"

"ఏం నేను శ్రీదేవిలా ఉన్నానా?" అంది కళ్లెగరేస్తూ. విక్రమ్ ఎగిరిపడ్డాడు కళ్లతోపాటుగా.

"ఛీ! శ్రీదేవి ఎందుకు పనికి వస్తుంది మీ ముందు? ముక్కుకు ఆపరేషన్, జాకెట్లో పాడ్స్, హిప్ పాడ్స్ ... అంతా అరువు సరుకు! మేకప్ తీసేస్తే చూడగలమా? నీది నిఖార్సయిన యవ్వనం. సినిమా ఏక్టర్లంటే ఉన్న క్రేజ్ వలన అలా అంటాం కానీ, ఏమిటో పిచ్చి మగాళ్లం ... అంతే!" అన్నాడు చేతులు అటూ ఇటూ తిప్పుకుంటూ.

చక్రాల్లాంటి కళ్లను అతని కదలికలకు అనుగుణంగా తిప్పుతూ పరవశమైంది ఆమె. ఏ ఆడదైనా సరే, తన అందం పొగిడితే, మొదట్లో చిరుకోపం వచ్చినా, మగాడికి దాసానుదాసురాలై పోవడం ఖాయం! సరిగ్గా అదే జరిగింది.


"నాకు వాడుకగా వచ్చే రిక్షావాడు మీ గురించి చెప్పాడు. మీ కదలికలు తెలుసుకున్నాను. సరదాగా కిళ్లీకోసం కాదు, మీ కోసమే పాన్‌షాపు దగ్గరకు వచ్చాను.


"నాకు ఉన్న అనుభవంతో మగాళ్ల చూపులకు అర్థాలు, రకాలు తెలుసును. కోరికతో ఉన్న చూపులు, కోరిక నిండిన చూపులు ... అనుభవించాలని చూసే చూపులు ... అనుభవించలేక చూపులతో రమించే చూపులు ... వెకిలి చూపులు ... మీలాగా నిజంగా సరసంతో చూసే చూపులు ... ఎవరైనా ఏమనుకుంటారేమోనని చూసే దొంగ చూపులు ...

"మీ చూపు అసలైన మగాడి చూపు! వెంటనే రిక్షావాడికి చెప్పాను 'రేపు సాయంత్రం ఆ అయ్యగారు నా దగ్గరకు వస్తారు తీసుకురా!' అని. వాడు బిక్కచచ్చిపోయాడు.

"అమ్మగారూ! అలా చెప్పేస్తున్నారేమిటి?"

"నువ్వే చూస్తావుగా రేపు! అన్నాను. నా ఊహ ఎప్పుడూ నిజం అవుతుంది. పది మూరల జాజిపూలు తెప్పించాను. ఎంసి, బ్రాందీ






తెప్పించాను, మీ కిష్టమని. ఐస్‌క్రీమ్స్ తెప్పించాను. హల్వా తెప్పించాను. చికెన్ జాయింట్స్ కూడా ఉన్నాయి. మరి మీదే ఆలస్యం..." అంటూ పడక గదిలోకి దారితీసింది.

ఆ గది చుట్టూ అద్దాలు. మధ్యలో రివాల్వింగ్ బెడ్. తెల్లని బెడ్‌షీట్ ....

దేవత అమృతం ఇచ్చినట్లుగా ఆమె చేతితో ఇస్తున్న బ్రాందీ తాగుతూ, చుట్టూ అద్దాలలో దేవత విశ్వరూపం తనివితీరా చూస్తూ, ఆమె పెదవుల అమృతంతో రసహృదయుడై రెండు వెండికొండల నడుమ ముఖాన్ని కడుగుకుని ... అలా .... అలా .... లోయల్లో విహరిస్తూ హిమాలయ పర్వతసానువుల్లో మంచుకొండల చీలికలా ఉన్న ఆమె అందాల నడుమ తేలియాడి, మన్మథునిలా, ఆమె రతీదేవిలా ఆ గదిలో తొలిసారిగా ఏ స్త్రీ దగ్గరా పొందని రసికత, మమైక్యం, పులకింత పొందాడు విక్రమ్.

పది మూరల జాజిపూలు ఇద్దరి మధ్యనా నలిగిపోయి నల్లగా వాడిపోయాయి.

విక్రమ్ ఆమె చెవిలో ... "ఐ లవ్ యూ, శ్రీదేవీ!" అన్నాడు.

ఆమె అతని పెదవులను తన పెదాలతో మూసేసి, "వన్స్‌మోర్ ప్లీజ్!" అంటూ అతని శరీరాన్ని కప్పేసింది.

ఇలా మొదలైన శ్రీదేవి పరిచయం రవ్వ ముక్కుపుడకతో ప్రారంభమై, మెడలో నెక్లెస్ వరకూ ... ఆమె నిత్యావసరాలు చూసేవరకూ సాగింది. సాగుతోంది.

విక్రమ్ పెళ్లంటూ చేసుకోలేదు గానీ, ఒకే స్త్రీ సంగమానికి అలవాటు పడిపోయాడు. శ్రీదేవి మత్తేమిటో తెలియదు కానీ, హెరాయిన్‌కి బానిస అయిపోయినట్లు అయిపోయాడు.

ఆమె అతని మనసులో శాశ్వత హీరోయిన్ అయి కూర్చుంది.

అప్పుడప్పుడూ ఆమె కౌగిట్లో వేడి కరిగిపోయాక, చల్లదనంలో "ఏమిటి ఇలా అయిపోతున్నాను?" అని ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాడు.

మొత్తానికి అతని మగతనాన్ని ఒకే స్త్రీతో జీవితమంతా గడపకూడదనే మొండితనాన్ని జయించిందామె.

ఒకరోజు సాయంత్రం శ్రీదేవికి స్ప్రేలంటే ఇష్టం అని మార్కెట్‌లోకి అప్పుడే వచ్చిన ఫారిన్ స్ప్రే బాటిల్, స్వీట్స్, యాపిల్స్, జాజులుతో సహా ఆనందంగా విజిల్ వేసుకుంటూ మోటార్ బైక్ దిగబోతూ, ఆమె ఇంటిదగ్గర రిక్షా ఆగి ఉండటం చూశాడు.

ఇదేమిటీ? రిక్షా ఎందుకు వచ్చింది? ఎవరు వచ్చారు? అనుకుంటూ నెమ్మదిగా చప్పుడు చేయకుండా వీధి గుమ్మందగ్గర నిలబడ్డాడు. లోపలనుండి మాటలు వినిపిస్తున్నాయి.

"అమ్మగోరూ! పట్నం నుండి నిన్న రాత్రే సినిమా షూటింగోళ్లు వచ్చారంట. ఆ నిర్మాతగారిది పక్కూరేనంట. మనం ఒకసారి నిర్మాతగారిని చూడాల. నిర్మాతగారు ఉండే గెస్ట్ హౌస్ దగ్గరకి మనం షికారు వెళ్దాం!" అంటున్నాడు రిక్షా వాడు.

"అవును. ఇతనితో విసుగొచ్చేస్తోంది. వెధవ ప్రేమ ... ఇంకేమి కానుకలు ఇవ్వగలడులే! అంతా అయిపోయింది. ఏం అడుగుతాం? అయినా ఒక్క మగాడితోనే నేను అతుక్కుపోతే, నా భవిష్యత్తు సంగతి ఏమిటి? త్వరగా వెళ్లి వివరాలు తెలుసుకునిరా! జాగ్రత్త, అతను వచ్చే టైమైంది, వింటే బాగుండదు. నిర్మాతగారు పరిచయమైతే బిచాణా ఎత్తేద్దాం!" అంటోంది శ్రీదేవి.

"వస్తానమ్మగోరూ!" అంటూ రిక్షావాడు బయటకు వస్తున్నాడు.

విక్రమ్ చాటుగా నక్కి నిలబడ్డాడు వాడికి కనపడకుండా.

విక్రమ్ మనసులో విస్ఫోటనం!

తను తెచ్చిన స్ప్రే బాటిల్, స్వీట్స్, యాపిల్స్, సన్నజాజులు గడపమీద పెట్టి, విక్రమ్ వెనుతిరిగాడు.

బైక్‌మీద ఇంటికి ఎలా వచ్చాడో తెలియదు. ఇటికి రాగానే, "అమ్మా! నాకు పెళ్లి చేసుకోవాలని ఉంది. వెంటనే ... ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పెళ్లి చెయ్యి!" అన్నాడు.

ఆమె విక్రమ్ మాటలకు ఆనందపడి, "నా తండ్రే! ఇన్నాళ్లకు వెంకన్నబాబు నీ మనసు మార్చాడు. చాలురా? పది రోజుల్లో పెళ్లి చేసేస్తాను!" అంటూ సంతోషంతో తల్లి లోపలకు వెళ్లింది.

పొరలు కమ్మిన తన కళ్లను తెరిపించినందుకు శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు మనసులో విక్రమ్.

మనసు బాగాలేక, తలంతా మొద్దుబారిపోయినట్లుగా ఉంది. టీపాయ్‌మీద ఉన్న పుస్తకం తీసుకున్నాడు. అందులో మొదటి పేజీలో

"భార్య మరో అమ్మ
వేశ్య ఒక బొమ్మ
భార్యను ఆలి అంటారు
ఆకలి, ఆప్యాయత, అనురాగం, ఆవేశం
ఆపేక్ష, ఆవేదన, ఆక్రోశం
అన్నీ ఆమెలో ఉన్నాయి
బొమ్మతో మీరే ఆడుకోవాలి!
బొమ్మలో స్పందన ఉండదు
వేశ్య అంటే వెలయాలు!"

అవును, రచయిత ఎంత సమంజసంగా చెప్పాడు!

తను ఎడారిలో నీటి చలమకోసం తాపత్రయపడ్డాడు. వివాహ వ్యవస్థను అర్థం చేసుకోలేకపోయాడు.

తనకు బాగా బుద్ధి వచ్చింది.

మొన్నటిదాకా అందమైన స్త్రీలను కలల్లో ఊహించుకున్న విక్రమ్, ఇప్పుడు తన వైవాహిక జీవితం గురించి ఊహల్లో విహరిస్తున్నాడు. ■